సాక్షి
వికారాబాద్

బుధవారం । 13 । డిసెంబర్ । 2023



ఇసుక మాఫియా..

ఇసుక మాఫియాను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తాండూరు ఆర్డీఓ శ్రీనివాసరావు తెలిపారు. 8లో▸



నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఓ కృష్ణన్ అధికారులను హెచ్చరించారు. 8లో▸



వ్యవసాయం పండగ

వ్యవసాయం దండగ కాదని, రైతులకు పండుగ లాంటిదని ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి అన్నారు. 9లో▸

గ్రహణం వీడేనా?



వరద నీటితో కళకళలాడుతున్న శివసాగర్ ప్రాజెక్టు

- రెండు దశాబ్దాలుగా ముందుకు సాగని శివసాగర్ ప్రాజెక్టు పనులు
- నిర్మాణ దశలోనే తూము, కాల్వలు
- ప్రాజెక్టు పూర్తయితే వెయ్యి ఎకరాల ఆయకట్టుకు నీరు
- కొత్త ప్రభుత్వంపై మండల రైతుల ఆశలు

యాలాల: రెండు దశాబ్దాలుగా అసంపూర్తిగా ఉన్న శివసాగర్ ప్రాజెక్టు పనులు కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందనే నమ్మకంతో ఆయకట్టు రైతులు ఉన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టు కావడం.. ఇటీవల ఆ ప్రభుత్వమే అధికారంలోకి రావడంతో రైతులు ఆశలు రెట్టింపయ్యాయి. యాలాల మండలం విశ్వనాథ్‌పూర్ సమీపంలో కాకరవేణి నదిపై 2005లో అప్పటి ప్రభుత్వం శివసాగర్ ప్రాజెక్టు పనులను ప్రాంభించింది. అలుగు నిర్మాణం పూర్తి కాగా నేటికీ తూము, కాలువల పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. రేపు, మాపు అంటూ పనులను వాయిదా వేస్తుండడంతో మండల రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రాజెక్టు పనుల్లో భాగంగా కాల్వల అలైన్‌మెంట్ ఏరియాను గుర్తించి హద్దులు నిర్ణయించారు. ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే తమకు సాగునీటి కష్టాలు తీరుతాయని దాదాపు 19 ఏళ్లుగా ఆయకట్టు రైతులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతులు ఆశలు మళ్లీ చిగురించాయి.

2005లో అంకురార్పణ

జలయజ్ఞంలో భాగంగా కాకరవేణి నదిపై విశ్వనాథ్‌పూర్ శివారులో శివసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి 2005 ఆగస్టు 4న అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అంకురార్పణ చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్ణయించారు. అయితే వివిధ కారణాలతో ప్రాజెక్టు పనులు ఒక అడుగు ముందుకు, ఆరడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది.

పెరిగిన అంచనా వ్యయం

2005లో శివసాగర్ ప్రాజెక్టును రూ.5 కోట్ల నిర్మాణ వ్యయంతో పనులు ప్రారంభించారు. ప్రాజెక్టు కరకట్ట, తూముల నిర్మాణం, అలుగు, కాల్వల నిర్మాణ పనులను ప్రారంభించారు. నాసిరకం పనులు, భారీ వరదల కారణంగా ప్రాజెక్టు ఎడమ కాలువ తూము ఎనిమిదేళ్ల క్రితం కొట్టుకుపోయింది. వరద ఉధృతికి అలుగు ప్రాంతం దెబ్బతింది. రెవిట్‌మెంట్, బెడ్లు దెబ్బతిని భూమి కోతకు గురైంది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రాజెక్టు అంచన వ్యయం రూ.12 కోట్లకు చేరింది. ప్రస్తుతం అలుగు పని పూర్తి కాగా, కాల్వలు, తూముల నిర్మాణాలు మిగిలిపోయాయి. ఈ పనులను రేపు, మాపు అంటూ అధికారులు దాటవేస్తున్నారు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం శివసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేస్తుందన్న నమ్మకంతో మండల వాసులు ఉన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారిస్తారని స్థానిక నాయకులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా కొత్త ప్రభుత్వంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సారథ్యంలో శివసాగర్ ప్రాజెక్టును పూర్తి చేస్తారనే నమ్మకంతో ఆయకట్టు రైతాంగం ఉంది.

అలైన్‌మెంట్ కేటాయింపు

ఈ ప్రాజెక్టు కింద విశ్వనాథ్‌పూర్, యాలాల, గోవిందరావుపేట, సంగెంకుర్దు, రాఘవపూర్, కమాల్‌పూర్, కోకట్ తదితర గ్రామాలు ఉన్నాయి. వెయ్యి ఎకరాలకు పైగా ఉంది. ఎడమ కాల్వ 4 కిలో మీటర్లు, కుడి కాల్వ 3 కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన అలైన్‌మెంట్‌ను సైతం అధికారులు సిద్ధం చేశారు. కాల్వల నిర్మాణంతో పాటు గతంలో కొట్టుకుపోయిన తూము పునఃనిర్మాణ పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇదే స్ఫూర్తితో సాగుదాం

- ఎన్నికలు విజయవంతం కావడంతో అధికారులను అభినందించిన కలెక్టర్
- రానున్న ఎన్నికలనూ సక్సెస్ చేద్దామని పిలుపు
- అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆదేశం

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయడంపై కలెక్టర్ సీ నారాయణరెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన అన్ని శాఖల అధికారులను అభినందించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి నర్సరీల నిర్వహణ, పారిశుద్ధ్యం తదితర అంశాలపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఏపీవోలు, ఏపీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి అధికారి చిత్తశుద్ధితో పనిచేశారని తెలిపారు. త్వరలో గ్రామ పంచాయతీలకు, ఎంపీ, మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయినందున ఇక అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. బుధవారం నుంచి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. మంచినీటి సమస్య, విద్యుత్ దీపాల సమస్య లేకుండా చూడాలన్నారు. హరితహారంలో భాగంగా నర్సరీలకు కేటాయించిన మొక్కల పెంపకం లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను రక్షించాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులను పెంచాలని సూచించారు. వీధి వ్యాపారులకు రక్ష రుణాలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాధ్యతగా విధులు నిర్వహించాలని, క్షేత్రస్థాయి సిబ్బందికి అటెండెన్స్ యాప్‌ను పక్కాగా అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఆర్‌డీఓ కృష్ణన్, డిప్యూటీ సీఈవో సుభాషిణి, డీపీఓ తరుణ్ కుమార్, మెప్మా పీడీ రవికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సత్కారానికి నామినేషన్ల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించినవారిని ప్రభుత్వం సత్కరిస్తుందని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నవీన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా రంగాల్లో కనీసం ఐదేళ్లు, అంతకంటే ఎక్కువ కాలం ఆదర్శప్రాయమైన సేవలు అందించిన వారిని తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. సామాజిక, విద్య, వైద్య, సాహిత్య, క్రీడా రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన వ్యక్తులు, సంస్థల నుంచి నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 15వ తేదీ సాయంత్రం 5గంటల వరకు కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందించాలన్నారు.



పోలీసులకు సూచనలు చేస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

శాంతిభద్రతలకు సహకరించాలి

- శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి

ఆమనగల్లు: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని శంషాబాద్ డీసీపీ కె.నారాయణ రెడ్డి కోరారు. ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. పట్టణంలోని పోలీసు స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కంట్రోల్ కమాండ్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పోలీసులు ప్రజల మధ్య మంచి వాతావరణం ఏర్పడిందని చెప్పారు. తమకు జరిగిన అన్యాయం గురించి పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయొచ్చని ఆయన సూచించారు. ఆమనగల్లు పోలీసు స్టేషన్ పరిధిలో క్రైం రేటు తక్కువగా ఉందని ఇది మంచి వాతావరణాన్ని సూచిస్తోందని అభినందించారు. ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. ఆమనగల్లులో ప్రస్తుతం ఉన్న పోలీసుస్టేషన్ భవనం స్థలం ఇరుకుగా ఉండటంతో మరో స్థలంలో నిర్మించడానికి ప్రభుత్వ భూమిని కేటాయించాలని అధికారులను కోరినట్టు తెలిపారు. ఆమనగల్లు పోలీసు స్టేషన్ పనితీరుపై డీసీపీ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఏసీపీ ఎన్‌సీహెచ్ రంగస్వామి, ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ బాల్‌రాం, ఎఎస్ఐలు యాదయ్య, బాల్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ షురూ..

- కోడ్ ముగియడమే ఆలస్యం బెల్టు షాపులకు తెరుచుకున్న ద్వారాలు
- 60నుంచి 70శాతం విక్రయాలు వీటి ద్వారానే..
- ఒక్కో మండలంలో 100కు పైగా షాపులు
- జిల్లా వ్యాప్తంగా దాదాపు 1,800 ఉన్నట్లు అంచనా
- ప్రోత్సహిస్తున్న ఎక్సైజ్ శాఖ



వికారాబాద్: గ్రామాల్లో మళ్లీ బెల్టు షాపులు మొదలయ్యాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో బెల్టు షాపులను సమర్థవంతంగా కట్టడి చేసిన అధికారులు ఆ తరువాత గాలికొదిలేశారు. దీంతో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. ఎన్నికల వేళ దాదాపు రెండు నెలల వ్యవధిలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి బెల్టు షాపుల నిర్వాహకులపై వందల సంఖ్యలో కేసులు నమోదు చేసి, బైండోవర్లు చేశారు. దాదాపు 4 వేల లీటర్లకు పైగా మద్యాన్ని సీజ్ చేశారు. కోడ్ ముగియగానే దాడులను ఆపేశారు. ప్రస్తుతం గ్రామాల్లో కిరాణా దుకాణాల కంటే బెల్టు షాపులే అధికంగా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. అయితే షాపుల నిర్వహణ మొత్తం ఎక్సైజ్ శాఖ కనుసన్నల్లోనే జరుగుతోందనేది బహిరంగ రహస్యం. మద్యం ప్రియుల కారణంగా గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

మామూళ్ల మత్తులో..


తండాలు, గిరిజన గూడాలు, మారుమూల అటవీ ప్రాంతాల్లో గుడుంబాను కట్టడి చేసిన ఎక్సైజ్ అధికారులు.. చిత్తశుద్ధితో పనిచేస్తే బెల్టు షాపులను నియంత్రించలేరా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అయితే ఒక్కో క్వార్టర్ నుంచి ఆఫ్ బాటిల్, ఫుల్ బాటిల్, బీరు బాటిళ్ల అమ్మకాల్లో ఎంఆర్‌పీ కంటే రూ. 10నుంచి రూ.50 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఎప్పుడైనా బెల్టు షాపు నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేస్తే మద్యం దుకాణదారులు వారికి రక్షణగా నిలుస్తున్నారు. వారి పలుకుబడితో కేసులు కాకుండా చూస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాల నుంచి నెలనెలా మామూళ్లు తీసుకుంటున్నారనేది బహిరంగ రహస్యం. పోలీసు శాఖలోనూ ఎస్ఐ మొదలుకుని సీఐ, డీఎస్పీ, జిల్లా స్థాయి అధికారుల వరకు మామూళ్లు తీసుకుంటుండటం వల్లే ఈ దందా జోరుగా సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కిరాణా షాపులకంటే అధికం

గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తుండడంతో అమ్మకాలు నాలుగింతలు పెరిగినట్లు స్పష్టమవుతోంది. జిల్లాలో ఏ గ్రామానికి వెళ్లినా కిరాణా దుకాణాల కంటే బెల్టు షాపులే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఒక్కో ఎక్సైజ్ ఠాణా పరిధిలో 400 వరకు బెల్టు షాపులు ఉన్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా 1,600 నుంచి 1,800 పైచిలుకు బెల్టు షాపులు ఉన్నట్లు అంచనా. డాబాలు, కిరాణా దుకాణాలు ఇలా ఎక్కడ బడితే అక్కడ మద్యం విక్రయిస్తున్నారు. మద్యం దుకాణాల్లో 30శాతం గిరాకీ ఉండగా బెల్టు షాపుల ద్వారా 70 శాతం వ్యాపారం జరుగుతున్నట్లు తెలిసింది. ఒకప్పుడు రోజుకు రూ. లక్ష అమ్మకాలు దాటని షాపులో నేడు రూ. 5 నుంచి రూ. 10 లక్షలు దాటి సేల్స్ ఉంటున్నాయి.

ప్రక్షాళన దిశగా..!

- జిల్లాలో దశాబ్ద కాలంగా తిష్టవేసిన అధికారుల బదిలీలకి ప్రభుత్వం కసరత్తు
- సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కావడంతో ప్రత్యేక ఫోకస్



తాండూరు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇలాఖాలో అభివృద్ధికి బాటలు వేసే సమర్థవంతమైన జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి అధికారుల టీమ్‌ను రెడీ చేసే ప్రక్రియ మొదలైంది. చాలా కాలంగా జిల్లాలో తిష్ట వేసిన మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారులను బదిలీపై పంపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు తమకు నచ్చిన అధికారులను నియమించుకొని పాలన సాగించారు. అధికారుల ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాంటి అధికారులకు చెక్ పెడుతూ లూప్‌లైన్‌లోకి పంపించేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో పలువురు అధికారులు దశాబ్ద కాలంగా ఒకే చోటు విధులు నిర్వహిస్తున్నారు. అలాంటి వారిని సైతం బదిలీ చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

పూర్తిగా ప్రక్షాళన

జిల్లాలోని 20 మండలాలతో పాటు డివిజన్, జిల్లా స్థాయి అధికారుల ప్రక్షాళనకు సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. జిల్లాలో 5నుంచి పదేళ్లకు పైగా విధులు నిర్వహిస్తున్న అధికారుల జాబితానే ఇప్పటికే రెడీ చేసినట్లు తెలిసింది. జిల్లా స్థాయి అధికారుల నియామకాలపై సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించనున్నట్లు సమాచారం. నియోజకవర్గాలలో ఎమ్మెల్యేల సిఫార్సులకు పెద్ద పీట వేసి అవకాశం కనిపిస్తోంది. ప్రధానంగా రెవెన్యూ, పోలీసు శాఖలతో పాటు వ్యవసాయం, మున్సిపల్, అటవీ, మెప్మా, ఐసీడీఎస్, విద్య, వైద్యం, మైన్స్, ఎక్సైజ్, డీఆర్డీఏ, పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, నీటిపారుదల శాఖలతో పాటు పలు శాఖల్లో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న అధికారుల బదిలీలు అనివార్యమయ్యాయి. వారం రోజుల వ్యవధిలో బదిలీల ప్రక్రియ పూర్తి చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చే నెలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉండటంతో గత ప్రభుత్వంలో ఉన్న అధికారులను వెంటనే బదిలీ చేయాలని ప్రభుత్వంపై ఎమ్మెల్యేలు ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం.

ఉచిత బస్సు.. రాబడి తుస్సు

- మహిళలకు ఆర్టీసీలో ఫ్రీ జర్నీ
- రోజురోజుకూ పెరుగుతున్న సంఖ్య
- డిపోలకు పడిపోతున్న ఆదాయం
- నష్టాల నుంచి గట్టెక్కేదెలాగో..?



ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో

ఇబ్రహీంపట్నం: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రవేశపెట్టడంతో ఆర్టీసీ ఆదాయానికి భారీగా గండి పడింది. ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసుల్లో వయసుతో సంబంధం లేకుండా మహిళలు, ట్రాన్స్‌జెండర్స్‌కు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని శనివారం నుంచి ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు చేసే మహిళలు, విద్యనభ్యసించే విద్యార్థినులకు పాసుల రెన్యూవల్, కొత్త బస్‌పాసుల అవసరం లేకుండాపోయింది. డీలక్స్, సూపర్ లగ్జరీ, గరుడ ఏసీ బస్సుల్లో మాత్రం యథావిధిగా టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో 120 బస్సులుండగా అందులో ఆర్డినరీ వంద, మెట్రో బస్సు సర్వీసులు మరో 20 వరకు ఉన్నాయి. నిత్యం 1,200 ట్రిప్పులు, 38 వేల కిలోమీటర్లు ఈ డిపో బస్సులు తిరుగుతుంటాయి. ప్రతి రోజు లక్షన్నర మంది ప్రయాణికులు ప్రయాణం సాగిస్తుంటారు. నిత్యం సుమారు రూ.13లక్షల నుంచి రూ.15 లక్షల వరకు డిపోకు ఆదాయం సమకూరుతుంది. అందులో బసు పాసుల ద్వారానే రూ.60 వేల వరకు వచ్చేది. ఇప్పుడు మహిళలకు టికెట్ తీసుకునే అవసరం లేకపోవడంతో ఆర్టీసీ రాబడి గణనీయంగా పడిపోయింది. 20 ఏళ్లుగా నష్టాల్లో ఉన్న ఇబ్రహీంపట్నం డిపో గత సంవత్సరం చివరి నుంచే లాభాల బాట పట్టింది. ప్రస్తుతం ఉచిత ప్రయాణంతో సంస్థ ఆదాయానికి భారీగా గండిపడింది.

రోజుకు రూ.ఏడు లక్షలకు దెబ్బ

గడిచిన మూడు రోజులుగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. ఈ లెక్కన రోజుకు ఇబ్రహీంపట్నం డిపో 50 శాతం ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది. నిత్యం రూ.13లక్షల నుంచి రూ.15 లక్షల వచ్చే ఆదాయం ఇప్పుడు రూ.7 లక్షలకు పడిపోయింది.

సంఖ్య మరింత పెరిగే అవకాశం

ఉచిత ప్రయాణంతో మహిళల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. జీహెచ్‌ఎంసీ, ప్రభుత్వ, ప్రైవేట్, ఇతర సంస్థల్లో పనిచేసే మహిళలు, విద్యార్థినులు బసు పాసులు తీసుకొని నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అంతేగాక వివిధ ఫంక్షన్లు,ఏదో పనిపై ఇంట్లో నుంచి వెళ్లే మహిళలకు బస్సు చార్జీలు ఉండకపోవడంతో ఆదాయం మరింతగా పడిపోనుంది. ఇబ్రహీంపట్నం,హైదరాబాద్, మాల్, దండుమైలారం తదితర రూట్లలో రాకపోకలు ఎక్కువగా సాగుతుంటాయి. ఉచిత ప్రయాణంతో మహిళల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఆయా రూట్లలో తప్పనిసరిగా బస్సుల సంఖ్యను పెంచాల్సిందేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి ప్రభుత్వం ఆర్టీసీ నష్టాన్ని ఎలా పూడ్చుతుందో, ఎలా గట్టెక్కిస్తుందో వేచి చూడాలి.

ఆదాయం తగ్గింది



మహిళల ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో డిపోకు 50 శాతం ఆదాయం తగ్గింది. రోజుకు 13లక్షల రూపాయల నుంచి 15 లక్షల రూపాయలకు పైగా ఆదాయం వచ్చేది. ఇప్పుడు ఏడు లక్షలు మాత్రమే వస్తోంది. మహిళా ప్రయాణికుల సంఖ్య ఇంకా పెరగొచ్చు. మూడు రోజులుగా ఇదే పరిస్థితి ఉంది.

– వెంకటనర్సప్ప, డిపో మేనేజర్, ఇబ్రహీంపట్నం

న్యూస్‌రీల్

15న దివ్యాంగులకు క్రీడా పోటీలు

వికారాబాద్ అర్బన్: ఈ నెల 15న అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని బ్లాక్ గ్రౌండ్‌లో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు మహిళా శిశు, వికలాంగుల శాఖ అధికారి లలిత కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల దివ్యాంగులు 15వ తేదీ ఉదయం 9గంటలకు హాజరు కావాలని కోరారు. పరుగు పందెం, షార్ట్ పుట్, చెస్, క్యారమ్స్, జావలిన్ త్రో తదితర క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, దివ్యాంగులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎఫ్ఎల్ఎన్‌ను అమలు చేయాలి

డీఈఓ రేణుకాదేవి



పదో తరగతి విద్యార్థినులతో రేణుకాదేవి

బొంరాస్‌పేట: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల సాధనే లక్ష్యంగా చేపట్టిన ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ) కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలో అమలు చేయాలని డీఈఓ రేణుకాదేవి సూచించారు. మంగళవారం మండలంలోని చౌదర్‌పల్లి, బొంరాస్‌పేటలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆమె సందర్శించారు.పాఠశాలల వారీగా,ఉపాధ్యాయుల వారీగా టీఎల్ఎంలను పరిశీలించి సూచనలు ఇచ్చారు.అనంతరం పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో క్లస్టర్ హెచ్‌ఎంలు, ఆర్పీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

వికారాబాద్ అర్బన్: నిరుద్యోగ యువత కోసం ఈ నెల 14న జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుల్ సుభాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే జాబ్‌మేళాకు నిరుద్యోగ యువత హాజరు కావాలని కోరారు. సుమారు 200 మంది ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల కోసం యువకులు మాత్రమే రావాలని సూచించారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హత తోపాటు 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలన్నారు. నెలసరి వేతనం రూ. 20 వేల నుంచి రూ. 30వేల వరకు ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం సెల్ నంబర్ 9676047444లో సంప్రదించాలని సూచించారు.

ఎంపీ స్థానాలన్నీ గెలుస్తాం


బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి



మాట్లాడుతున్న సదానందరెడ్డి

అనంతగిరి: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలోని అన్ని ఎంపీ స్థానాలను బీజేపీ గెలుస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈ సారి బీజేపీకి ఓట్ల శాతం పెరిగిందన్నారు. గ్రామీణ ప్రజలు బీజేపీ వైపు నిలిచారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అక్రమ డబ్బుతో గెలవాలని చూస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండు గౌడ్, సీనియర్ నాయకులు నరోత్తంరెడ్డి, శంకర్, లక్ష్మారెడ్డి, రఘుపతి, బస్వలింగం తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ ఎమ్మెల్యే ప్రసాద్‌కుమార్‌కు సన్మానం



ప్రసాద్‌కుమార్‌ను సన్మానించి బొకే అందజేస్తున్న రాములు

తాండూరు: అసెంబ్లీ స్పీకర్‌గా నియమితులైన వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌ను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఇందూర్ రాములు సన్మానించారు. మంగళవారం ఆయన్ను నగరంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

భవానీ మాత సేవలో వికారాబాద్ ఎమ్మెల్యే



ఎమ్మెల్యే ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం వెంకటపూర్ తండాలోని భవాని మాత అమ్మవారి ఆలయంలో వికారాబాద్ ఎమ్మెల్యే జి.ప్రసాద్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ విజయం సాధించినందుకు 1,111 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ పూజకు హాజరైన ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ చైర్మన్ సత్యనారాయణ, యువ నాయకుడు పరుశరాం నాయక్, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అధికారుల అభినందనలు



ఎమ్మెల్యే బీఎంఆర్‌తో ఎస్సైలు

తాండూరు టౌన్: తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డికి నియోజకవర్గ పరిధిలోని అధికారులు అభినందనతలు తెలిపారు. మంగళవారం ఆయకు పూలమొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తాండూరు ఏడీ జాకబ్, తాండూరు టౌన్ ఎస్సై అబ్దుల్ రవూఫ్, యాలాల ఎస్సై అరవింద్, బషీరాబాద్ ఎస్సై వేణుగోపాల్ గౌడ్, తాండూరు ఎస్సై మధుసూదన్ రెడ్డి, పెద్దేముల్ ఎస్సై కాశీనాథ్ తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

స్థానిక సంస్థలపై దృష్టి సారించండి

ఎంపీ బండి సంజయ్



ఎంపీ బండి సంజయ్‌తో మారుతికిరణ్

పరిగి: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ కలిశారు. ఢిల్లీలోని ఎంపీ నివాసంలో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై ఆరా తీశారు. స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాలని సూచించారు. వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందించుకోవాలని.. సర్పంచ్‌లను గెలిపించుకునేందుకు శక్తి వంచన లేకుండా పనిచేయాలన్నారు.

నూతన అడ్వకేట్లకు సభ్యత్వం



సభ్యత్వం తీసుకుంటున్న న్యాయవాదులు

అనంతగిరి: ఇటీవల ఎల్‌ఎల్‌బీ పూర్తిచేసిన పలువురు న్యాయవాదులు వికారాబాద్ జిల్లా బార్ అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా వారికి సీనియర్ న్యాయవాదులు సభ్యత్వం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జగన్, సీనియర్ న్యాయవాదులు బస్వరాజు, లవకుమార్, లక్ష్మణ్, రమేష్‌గౌడ్, తులసీరాం, రాజశేఖర్, రవి, ఈశ్వర్ తదితరులున్నారు.

ఇసుక మాఫియా కట్టడికి 'వాల్టా'

- తాండూరు నియోజకవర్గ ప్రజలకు రూ.600కే ట్రాక్టర్
- అక్రమంగా రవాణా చేస్తే క్రిమినల్ కేసులు
- ఆర్డీఓ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసరావు, చిత్రంలో డీఎస్పీ శేఖర్ గౌడ్, మైన్స్ ఏడీ జాకబ్

తాండూరు టౌన్: ఇసుక మాఫియాను అరికట్టేందుకు వాల్టా–2002 ప్రకారం ఇసుక తాండూరు నియోజకవర్గ ప్రజలకు ఇసుక అందజేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం తాండూరు ఆర్డీఓ శ్రీనివాసరావు డీఎస్పీ శేఖర్‌గౌడ్, మైన్స్ ఏడీ జాకబ్, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఇక నుంచి నియోజకవర్గ ప్రజలు రూ.600 డీడీ లేదా చలాన్ కట్టి ఇసుక పొందవచ్చన్నారు. నిబంధనలు అతిక్రమించి అక్రమంగా రవాణా చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యాలాల మండలంలోని బెన్నూరు ప్రాంతంలో ఇసుక రీచ్ పాయింట్‌ను ఏర్పాటు చేశామన్నారు. పరిణామ క్రమంలో మరికొన్ని పాయింట్లను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రీచ్ పాయింట్ వద్ద పాయింట్ మెన్‌గా పంచాయితీ కార్యదర్శి లేదా ఇతర సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. నిర్మాణానికి కావలసినన్ని ట్రాక్టర్ల ఇసుకను బుక్ చేసుకోవచ్చన్నారు. అనుమతి తీసుకున్న తర్వాత రీచ్ పాయింట్‌ల నుంచి ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల లోపు ఇసుక తరలించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్లు లేదా లారీలు, ఇతర వాహనాల్లో ఇసుక అక్రమంగా తరలిస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. రాత్రి వేళల్లో రీచ్‌ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అక్రమంగా ఇసుక తరలించే ట్రాక్టర్‌కు తొలిసారి రూ.5 వేలు, రెండోసారి రూ.15వేలు, లారీలకు (10 టన్నుల లోపు) తొలిసారి రూ.25వేలు, రెండోసారి రూ.50వేలు, లారీలకు (10 టన్నుల పైన), ఇతర మిషనరీలకు తొలిసారి రూ.50 వేలు, రెండోసారి రూ.లక్ష, మూడోసారి వేటినైనా సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు ధారాసింగ్, శ్రీనివాసరెడ్డి, రూరల్ సీఐ రాంబాబు, తహసీల్దార్లు, ఎంపీపీలు, ఎంపీడీఓలు, ఎస్సైలు, డీటీ మహేశ్, రెవెన్యూ సిబ్బంది, లారీ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

అనంతగిరి: పెండింగ్ వేతనాలు, ఐడీ కార్డులు అందజేయాలని ప్రమోషన్ పొందిన వీఆర్‌ఏలు కలెక్టర్ నారాయణరెడ్డిని కోరారు. మంగళవారం వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నాలుగు నెలలుగా విధులు నిర్వహిస్తున్నా నేటికీ ప్రభుత్వం జీతాలు చెల్లించక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కోరారు.

బకాయి వేతనాలు చెల్లించండి

కొడంగల్ రూరల్: బకాయి వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రమోషన్ పొందిన వీఆర్‌ఏలు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 81, 85జీఓల ద్వారా రెవెన్యూ డిపార్ట్‌మెంటులో జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్, ఓఎస్‌లు నియామకం చేసిన ప్రభుత్వం ఇప్పటివరకు వేతనాలు అందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది సమ్మెకాలంలో మూడు నెలల వేతనాలు, ప్రస్తుతం ఐదు నెలల వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. నూతన ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరిస్తూ ఎంప్లాయీస్ ఐడీలతో బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు.



అనంతగిరి: కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డీఆర్‌డీఓ కృష్ణన్



వరి కొనుగోలు కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ కృష్ణన్

దోమ: ధాన్యం కొనుగోళ్లల్లో అధికారులు నిర్లక్ష్యానికి పాల్పడితే చర్యలు తప్పవని డీఆర్‌డీఓ కృష్ణన్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని పాలేపల్లి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల సమస్యలను తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు తప్పకుండా ప్రతీ రైతు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. ధాన్యం తేమ శాతం పరిశీలించి ప్రభుత్వ మద్దతు ధర కల్పించాలన్నారు. గన్నీ సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించే చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సురేశ్, సీసీలు సుజ్ఞాని, రైతులు పాల్గొన్నారు.

కార్యాలయాలకు కాసుల గండం

- నిధులు లేక నిలిచిన పనులు
- యాచారంలో ప్రారంభానికి నోచని ప్రభుత్వ భవనాలు



పనులు నిలిచిపోయిన భవనం

యాచారం: లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ప్రభుత్వ భవనాలను వాడుకలోకి తెద్దామన్న ఆలోచన అధికారులకు గాని, ప్రజాప్రతినిధులకు గాని లేకుండా పోయింది. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం మండల కేంద్రం ఉంది. సాగర్‌రోడ్డు పక్కనే మండల పరిషత్ భవన సముదాయాలు ఉన్నాయి. వీటిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఐకేపీ, వ్యవసాయ, ఈజీఎస్, ఇరిగేషన్ తదితర ప్రభుత్వ శాఖల కార్యాలయాలు కొలువుదీరాయి. కానీ కొన్ని భవనాలు నిర్మాణ దశలోనే నిలిచిపోగా, మరికొన్ని భవనాలు నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభానికి నోచుకోక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. రూ.లక్షల ప్రజాధనంతో నిర్మించిన భవనాలు ఉపయోగంలో లేక దిష్టి బొమ్మల్లాగా దర్శనమిస్తున్నాయి.

శిథిలావస్థకు..

యాచారం మండల కేంద్రంలో రూ.25 లక్షల జెడ్పీ నిధులతో పదేళ్ల కింద జెడ్పీ అతిథి గృహ నిర్మాణ పనులు ప్రారంభించారు. మూడేళ్లకు నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. కానీ, ఐదేళ్ల గడుస్తున్నా కూడా నేటికి అతిథి గృహం ప్రారంభానికి నోచుకోవడం లేదు. మహానగరానికి దగ్గరలో ఉన్న మండలానికి తరచూ పర్యటనల నిమిత్తం ఉన్నతాధికారులు వస్తుంటారు. ఆ సమయంలో వసతి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. అతిథి గృహం ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుకుంటుంది. భవనానికి కిటికీలు లేకపోవడంతో పక్షులకు ఆవాసంగా మారింది. గోడలకు రంధ్రాలు పడి విషసర్పాలు లోపలికి పోతున్నాయి. రూ.లక్షలాది నిధులతో కొనుగోలు చేసిన ఫర్నిచర్ నిరుపయోగంగా మారింది. విలువైన సామగ్రి తుప్పు పట్టి పోతుంది.

దిష్టిబొమ్మలా సమావేశ మందిరం

మండల పరిషత్ కార్యాలయంలో ఐదేళ్ల కిందట రూ.25 లక్షల నిధుల ప్రణాళికతో నూతన సమావేశపు హాల్ నిర్మించాలని అధికారులు భావించారు. రూ.15 లక్షలకు పైగా నిధులు ఖర్చు చేసి స్లాబ్ వరకు నిర్మాణ పనులు చేపట్టి వదిలేశారు. అప్పట్లో 20 గ్రామ పంచాయతీలే ఉండడంతో హాల్ సరిపోయేది. ప్రస్తుతం 24 గ్రామ పంచాయతీలకు పెరగడంతో అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు కూర్చోవడానికి హాల్ సరిపోవడం లేదు. అత్యవసర సమావేశాల్లో కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు బయటనే ఉండాల్సి వస్తుంది.

మరుగుదొడ్లు నిర్మించాలని డిమాండ్

ఎంపీడీఓ, తహసీల్దార్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు పనులు నిమిత్తం ప్రజలు వస్తుంటారు. వారికి మరుగుదొడ్లు, మూత్రశాలల సౌకర్యం లేదు. సర్వసభ్య సమావేశాల్లో వీటిని నిర్మించాలని ప్రజాప్రతినిధులు ఆందోళనలు నిర్వహించినా ఫలితం లేకుండా పోతుంది. తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లకు వచ్చే రైతులు కూడా అత్యవసర సమయాల్లో చెట్లు, వ్యవసాయ భూముల్లో కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. మరుగుదొడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



ప్రతి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల సమయంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని కోరుతున్నాను. కానీ అధికారుల నుంచి స్పందన లేదు. రిజిస్ట్రేషన్లతో రూ.లక్షలాది ఆదాయం పొందుతున్న రైతులకు సౌకర్యాలు కల్పించాలనే ఆలోచన లేకపోవడం సరైంది కాదు.

– దంతుక పెద్దయ్య, సర్పంచ్, నానక్‌నగర్

నిధుల కొరత



మండల పరిషత్‌లో సరిపడా నిధులు లేకనే అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయకపోతున్నాం. ప్రభుత్వం నుంచి నాలుగేళ్లుగా నిధులు రావడం లేదు. త్వరలో అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అతిథి గృహం ప్రారంభించేలా కృషి చేస్తాం. సమావేశపు హాల్‌ను సైతం పూర్తయ్యేలా చూస్తాం.

– కొప్పు సుకన్య, ఎంపీపీ యాచారం

'వీర్లపల్లి' విజయం మాదే..

ఎమ్మెల్యే శంకర్‌ను అభినందించిన బాల్యమిత్రులు



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సన్మానిస్తున్న బాల్యమిత్రులు

నందిగామ: 37 ఏళ్ల క్రితం షాద్‌నగర్ ఎమ్మెల్యేతో కలిసి చదువుకున్న విద్యార్థులు మంగళవారం ఆయన్ను సన్మానించారు. 1986లో ఎమ్మెల్యే నందిగామ జెడ్పీహెచ్‌ఎస్‌లో పదోతరగతి పూర్తి చేశారు. కాంగ్రెస్ నుంచి శంకర్‌కు షాద్‌నగర్ టికెట్ రావడంతో ఆయనతో కలిసి చదువుకున్న విద్యార్థులంతా విజయానికి కృషి చేశారు. దీంతో మంగళవారం వారంతా ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రభుత్వ విద్యార్థులు



విద్యార్థులతో హెచ్‌ఎం విద్యావతి

కేశంపేట: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్–14 విభాగంలో ఎంపికైన నందీశ్వర్, శ్రీవాణిని పాఠశాల హెచ్‌ఎం విద్యావతి అభినందించారు. ఈ పోటీలు నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 13 నుంచి 15వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సర్పంచ్ తలసాని వెంకట్ రెడ్డి, పీఈటీ యాదయ్య, ఉపాధ్యాయులు ఆనంద్, వీరారెడ్డి, వెంకట ప్రసాద్, మహేందర్, రెడ్యాలాల్, అశోక్, పరశురాం అభినందించారు.

విద్యాప్రగతికి శ్రమించే వారికి గుర్తింపు

ఎంఈఓ హరిశ్చందర్‌నాయక్



హెచ్‌ఎం వెంకట్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ

పరిగి: విద్యాప్రగతి కోసం, విద్యార్థుల భవిష్యత్ కోసం కృషి చేసే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని మండల విద్యాధికారి హరిశ్చందర్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం వెంకట్ బదిలీపై వెళ్లారు. దీంతో ఆయనకు మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రజిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రిన్సిపాల్ రష్మిత



విద్యార్థిని సన్మానిస్తున్న గురుకుల అధ్యాపక బృందం

పరిగి: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించి గురుకులాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని పిన్సిపాల్ రష్మిత అన్నారు. జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థి అభినవ్ సౌండ్ ఇండియా కుంపులో గోల్డ్ మెడల్ సాధించాడు. దీంతో మంగళవారం అభినవ్‌ను పాఠశాల అధ్యాపక బృందం విద్యార్థిని ఘనంగా సన్మానించారు. మరింత ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

చెరువుల ఆక్రమణపై వివరణ ఇవ్వండి

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్లు, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని ప్రధాన చెరువుల ఆక్రమణపై తదుపరి విచారణకు హాజరై వివరణ ఇవ్వాలని కలెక్టర్లు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. చెరువు నీటి నిల్వ పూర్తి సామర్థ్యం, సరిహద్దులు నిర్ణయించి రాళ్లు ఏర్పాటు చేయాలని పదేళ్ల కిందట ఆదేశాలిచ్చినా ఇంకా అమలు చేయకపోవడంపై అసహనం వ్యక్తంచేసింది. ఉమ్మడిగా సర్వే చేసి స్థాయి నివేదిక అందజేయాలని ఆదేశించినా.. ఇప్పటివరకు ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టింది. తదుపరి విచారణలోగా నివేదిక అందజేయాలంటూ విచారణను ఈనెల 27కు వాయిదా వేసింది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని దుర్గంచెరువు, సున్నం చెరువు, ఫిర్జాదీగూడ పెద్ద చెరువు, చిన్న దామర చెరువు, చిన్న రాయుని చెరువు, నల్ల చెరువు.. ఇలా పలు చెరువులను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని మాదాపూర్‌కు చెందిన అనిల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆక్రమణలు జరగకుండా చర్యలు చేపట్టేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించింది.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

- వివాహేతర సంబంధం బయటపడిందని ఉరి వేసుకున్న వైనం
- శంకర్‌పల్లి మండలం బుల్కాపూర్‌లో సంఘటన

శంకర్‌పల్లి /చేవెళ్ల: వివాహేతర సంబంధం బయటపడిందని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శంకర్‌పల్లి మండలంలోని బుల్కాపూర్‌కి చెందిన మల్కారం శంకరయ్య(38) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కొన్నేళ్ల క్రితం ఆయనకు లలితతో వివాహం జరగగా ఓ కొడుకు, కూతురు ఉన్నారు. వీరి మధ్య గొడవలు తలెత్తడంతో వీడిపోయి వేరుగా ఉంటున్నారు. దీంతో శంకరయ్య లక్ష్మిని రెండో వివాహం చేసుకున్నారు. కొంత కాలానికి అయన శంకర్‌పల్లికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని భార్య లక్ష్మిని తరచూ హింసిస్తున్నాడు. కుటుంబ సభ్యులు 15 రోజుల క్రితం పంచాయితీ పెట్టి మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన శంకరయ్య సోమవారం రాత్రి సహజీవనం చేసే మహిళ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలోనే ఆయన మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు



ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన తులేకలాన్ కాంగ్రెస్ నాయకులు

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: తులేకలాన్ గ్రామాభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. మండలంలోని తులేకలాన్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కలిశారు. శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజకవర్గం అభివృద్ధి చెందడం ఖాయమన్నారు. అన్ని గ్రామాలకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో పాండు, శశాంక్‌రెడ్డి, సుదర్శన్, నారన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శశివర్ణ, జంగయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కన్నారెడ్డి, వెంకటేష్, పాండు, ప్రభు, శ్రీకాంత్, లింగం, జంగయ్య పాల్గొన్నారు.

పట్టుదలతోనే కల సాకారం

చైతన్య డీమ్డ్ వర్సిటీ వీసీ పురుషోత్తం రెడ్డి

మొయినాబాద్‌రూరల్: పట్టుదల, కృషి ఉంటేనే కలను సాకారం చేసుకోగలమని చైతన్య డీమ్డ్ వర్సిటీ వీసీ సీహెచ్.పురుషోత్తం రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ డాక్టర్ సాత్వికా రెడ్డి అన్నారు. కళాశాలకు చెందిన విద్యార్థిని అశ్విని డాక్టరేట్ సాధించడంతో మంగళవారం ఆమెను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



అశ్వినికి డాక్టరేట్ పట్టా అందజేస్తున్న పురుషోత్తం రెడ్డి తదితరులు

జానారెడ్డిని కలిసిన మేయర్



జానారెడ్డితో మేయర్ పారిజాత నర్సింహారెడ్డి దంపతులు

బడంగ్‌పేట్: సీఎల్పీ మాజీ నాయకుడు, మాజీ హోంమంత్రి కుందూరు జానారెడ్డి దంపతులను మంగళవారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జానారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. వీరి వెంట బాలాపూర్‌కు చెందిన పలువురు నాయకులున్నారు.